


# కాంతమ్మ జయమ్మ



రావినూతల సువర్ణకన్నన్

ఉదయం పదిగంటలకల్లా భోజనం ముగించుకుని ఓ నవల పట్టుకూర్చుంది. కాంతమ్మ. మరో అయిదు నిమిషాలకల్లా "ఏం చేస్తున్నావ్ కాంతమ్మొదినా!" అంటూ వచ్చింది పక్కింటి జయమ్మ.

ఆవిణ్ని చూడగానే కాంతమ్మ మొహం పున్నమినాటి చంద్రుడిలా వెలిగిపోయింది. చేతిలోని పుస్తకం పక్కన పడేసి....

"రావమ్మా వదినారా!" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది.

ఇద్దరూ దాదాపు యాభైదాటిన వాళ్ళే. మంచి స్నేహితులు. ఇద్దరూ కలిస్తే గాలి, నిప్పు ఏకమైనట్టే. వాళ్ళ నోళ్ళకి భయపడి, వాళ్ళ భర్తలిద్దరూ కలిసి మరీ పారిపోయారు.

వాళ్ళంటే ఇంట్లో వాళ్ళకేకాదు బైటి వాళ్ళక్కూడా హడలే. ఏ వేళ ఏ కొంపకి నిప్పు పెడతారో అని.

అంతక్రితం రోజే కాంతమ్మ కొడుకు కోడలు వూరెళ్ళారు. ఆ సంగతి తెలిసిన జయమ్మ ఆదరా బాదరా అన్నంతిని బైటపడింది.

"కొడుకు కోడలూ వూరికెళ్ళారటగా?" అంది జయమ్మ సంభాషణకి నాందిగా.

"ఆఁ. వెళ్ళార్లే!.... దాని బాబుకి జ్వరంట! టెలిగ్రాం వచ్చింది. సిగ్గు లేని వెధవ! వీడూ దానివెంటపడి పోయాడు." అంది కాంతమ్మ.

దాని బాబుకి అంటే కోడలి తండ్రి!

"అనుకుంటూనే వున్నాను. మామూలుగా అయితే నువ్వు పంపవని అలా ఎత్తేశాడా మునలాడు. పోనిద్దూ. మనం మనసు విప్పి మాట్లాడుకోవచ్చు" అంది జయమ్మ.

"నిజమే! ఏవిఁటి విశేషాలు?"... నవ్వుతూ అంది కాంతమ్మ.

"చాలా విశేషాలున్నాయి. అవి చెప్పడానికే పరిగెత్తుకొచ్చాను. అవునూ.. నువ్వుచదివే పుస్తకం ఏవిఁటి?" కుతూహలంగా అడిగింది జయమ్మ.

"చీడపురుగులు."

"ఏవిఁటి? మన అభిమాన రచయిత రాసిన చీడపురుగులా?" కెవ్వుమన్నంత పనిచేసింది కాంతమ్మ.

"ఆఁ.. ఆఁ... అదే! నిన్ననే మార్కెట్‌లోకి వచ్చింది."

రంగణ్నిపంపి అద్దెకి తెప్పించాను. నేను చదివాక నీకూ ఇస్తాన్లే! ముందు విశేషాలు చెప్పు" అందికాంతమ్మ.

జయమ్మ మొహం దిగులుగా పెట్టింది.

"ఏవిఁటో ఒదినా! ఆయన ఏక్షణాన కొంపలోంచి పోయారో గాని, ఆ క్షణం నించే నాకు కష్టాలు మొదలయ్యాయి. ఆ కొంపలో జీతంభత్యం లేని నౌకర్నయిపోయాను. కొడుకు కోడలూ వుద్యోగానికి పోతే కొంపకి కావలాగా నేను పడుండాలి. ఎప్పుడో ఎనిమిదింటికొండిపడేసిన కూడు తినాలి! అదేమంటే మేం వుద్యోగం వెలగబెడుతున్నాం అంటారు. నాకు తోచక ఇలాంటి నవలఏదైనా చదివితే, కోడలు ముసిముసిగా నవ్వుతుంది. అబ్బాయి మాత్రం ...

" ఈ వయసులో ఈ నవలల పిచ్చేమిటమ్మా! ఏ భారతమో చదువుకోక" అంటాడు.

"అయినా కాంతమ్మొదినా? మనకి చిన్నతనంలో పెళ్ళి చెయ్యబట్టి మనవలు పుట్టారుగానీ, మనం ఏమంత ముసలాళ్ళమనీ" అంది బాధగా.

"హాయ్యో, రోలెళ్ళిమద్దెలతో మొరెట్టుకున్నట్టుంది మన పరిస్థితి. మా కొంపలోనూ ఇదేవరస! మా మనవరాలు ఇంతలేదు. అదెన్ని మాటలంటుందో తెలుసా? మనకన్ని విషయాలూ కావాలిట. తంపులు పెట్టి తమాషా చూస్తామట... కోడళ్ళని రాచి రంపాన పెడతామట. పెట్టింది తిని కృష్ణారామా అనుకుంటూ పడుండాలిట!" కన్నీళ్లురాక పోయినా కళ్ళొత్తుకుంది కాంతమ్మ.

"అందీ, అంటుందంటుంది. ఎందుకన్నూ? మొగుడు ముండా అంటే ముష్టికొచ్చిన వాడుకూడా ముండా అంటాడన్నట్టు మనకొడుకులు చవటలయితే అంతే మరి! మొన్నటికి మొన్న మన ఎదురింటి పంకజాక్షి ఏ వందో విన్నావా?" కోపంగా అంది జయమ్మ.

"ఏవందేమిటి?" కళ్ళు చిట్లించింది కాంతమ్మ.

"మనిద్దరం రాక్షసులంట! మనం పెట్టే బాధలు పళ్ళేకే మన మొగుళ్ళు దేశాలు పట్టిపోయారట. మన పిల్లలు మంచివాళ్ళు కాబట్టి మనల్ని చూస్తున్నారట. లేకపోతే ఏనాడో ఇంట్లోంచి గెంటేసే వారట. రామ రామ. ఒక మాటా ఒక వలుకా?" తనూ రాని కన్నీళ్ళొత్తుకుంది జయమ్మ.

కాంతమ్మ కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. ముక్కుపుటాలు వుబ్బాయి.

"అయితే అదన్ని మాటలంటుంటే నువ్వు చేత కానట్టు చూస్తూ వూరుకున్నావా?" అంది ఆవేశంగా.

"ఆఁ వూరుకుంటానేవిఁటే! నాలుగు జాడించాను. అటేడు తరాలవాళ్ళనీ ఇటేడూ తరాల వాళ్ళనీ దుమ్మెత్తి పోశాను. అవన్నీ విన్లేక లోపలికెళ్ళి తలుపు లేసుకుంది"

"మంచిపని చేశావ్! ఓ మూల కట్టుకున్న మొగుళ్ళు సన్యాసుల్లో కలిశారని మనం ఏడుస్తుంటే మధ్యలో



## డాక్టరేటు పొందిన
## దాశరధి విజయలక్ష్మి

హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు స్మారక బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న శ్రీమతి దాశరధి విజయలక్ష్మి తెలుగులో సమర్పించిన "దాశరధి - విమర్శనాత్మక అధ్యయనం" అన్న పరిశోధనా వ్యాసానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్.డి. అవార్డు ప్రదానం చేసింది. డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి గారి పర్యవేక్షణలో ప్రముఖ తెలుగు కవి దాశరధి కృష్ణమాచార్య రచనలపై విమర్శనాత్మక అధ్యయనం చేసి, దాశరధి కవి మాత్రమే కాదని, కథ, నవలా రచయిత, నాటక రచయిత, బహుభాషావేత్త, వ్యాఖ్యాత, అనువాదకుడు, లలిత సినీగీత కర్తగా ఆయన సేవలను గురించి ఆమె తన పరిశోధనల్లో పరిశీలించారు.

విజయలక్ష్మి తన గురించి వివరిస్తూ, 'ప్రథమంగా ఈ భూమ్మీద ఊపిరి పీల్చింది భద్రాద్రి రాముని సన్నిధిలో, ఎనిమిదవ తరగతి చదువుతుండగానే గృహిణినై గార్హస్థ్య ధర్మాన్ని స్వీకరించడానికి మెట్టింది హైదరాబాద్ నగరంలోకి. పెళ్ళయి పాతికేళ్ళయినా ఇటు ఇల్లాలిగా, అటు ఉపాధ్యాయినిగా బాధ్యతలు నిర్వహిస్తూ తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ చేయాలన్న సంకల్పాన్ని సాధించ గలగడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోంది, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తోంది' అన్నారు.

సాహిత్యం, సైన్సు తెలుసుకోవటం; నవలలు, కథలు చదవటం, రాయటం, నాటికల్లో పాల్గొనడం తనకిష్టమైన పనులంటారు విజయలక్ష్మి.

ఆకాశవాణి హైదరాబాద్ 'ఎ' కేంద్రంలోనూ, అమృతవాణి సికిందరాబాద్ కేంద్రాలలోనూ డ్రామా ఆర్టిస్టుగా 200 కు పైగా నాటికలు, నాటకాలలో పాల్గొన్నారు. 'భాష్యం', 'నాకీ పెళ్ళొద్దు', 'అక్కరలేని పెళ్ళి', 'కాలుతున్న మనుమలు', 'ఓ పువ్వు పూసింది' ఆమెకు మంచి పేరు తెచ్చిన నాటకాలు. హైదరాబాద్ దూరదర్శన్‌లో అనేక కార్యక్రమాలకూ, స్వశక్తి క్రియేటర్స్ వారి 'కోకిల' ఆడియో మాగజైన్‌కూ వ్యాఖ్యాన సహకారం అందిస్తూంటారు.

తాను రచించిన 'జీవితం సశేషం', 'ఎదురుచూసిన ఉదయం' నవలలు; కథలలో 'నీడ తెగిన మనిషి', 'ఎడారి పువ్వు', 'సస్య శ్యామల దేశం' తనకెంతో సంతృప్తి కరమైనవని అంటారామె. కృష్ణాపత్రిక (వార) 'అవలోకనం' శీర్షిక క్రింద ఎన్నో సాహిత్య వ్యాసాలు, సమీక్షలు, యితర వార పత్రికలలో ఆమె రచించిన వ్యాసాలూ ప్రచురించ బడ్డాయి.

వనిత లో మార్చి 1982 సంచికలోనూ (సంక్రాంతి కథల పోటీ); జనవరి 1986 సంచికలోనూ (దీపావళి కథల పోటీ) బహుమతి పొందిన ఆమె వ్యాసాలు ప్రచురించ బడ్డాయి. ప్రతిక్లాసులో ఫస్టు రావటం, ప్రతి పోటీలో బహుమతి గెలుచుకోవటం పరిపాటి అయిన విజయలక్ష్మి జాలీ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు 1990 నవంబరులో నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతిని; వక్తృత్వపు పోటీలో ద్వితీయ బహుమతిని పొంది, నవంబరు 15వ తేదీన హైదరాబాద్‌లో, మిజోరం డిఐజి శ్రీమతి కిరణ్‌బేడి నుండి బహుమతులందుకున్నారు.

-గుదేటి అరుణ

భీళ్ళగేలొకటి! అన్నట్టు మొగుడంటే గుర్తొచ్చింది. మన మూడో ఇంటి మీనాక్షి సంగతి నీదాకా వచ్చిందా!" కడుపులో దాచుకొన్నట్టు వుత్సాహంగా అంది కాంత మ్మ

జయమ్మ కళ్ళు, విశాలమయ్యాయి. పరాయి వాళ్ళ విషయాలంటే చచ్చే ఇష్టమాయె ఇద్దరికీ.

"ఏవిఁటి మీనాక్షి సంగతేమిటి!" అంది ఆత్రుతగా

"అయితే నీకు నిజంగానే తెలియదన్నమాట! మొన్న మీనాక్షి బావ మిలట్రీనించి దిగాడా?"

"అవును. శలవులని వచ్చాడుగా... అయితే ఏమయింది!"

"ఇంకా ఏవయిందంటావేవిఁటొదినా, జరగరానిదే జరిగిపోయిందీ?"

"అంటే?"

"నా బొంద. ఇంకా అర్థం అవలా! అదీ... వాళ్ళ బావతో- ఛ!ఛ! ఇలాంటి అపవిత్రమైన మాటల్ని నానోటితో చెప్పలేనమ్మా!" అదోలా అంది కాంతమ్మ.

జయమ్మలో కుతూహలం పెరిగిపోయింది.

"అయితే ఆ మీనాక్షి... వాళ్ళ బావతో..."

"ఆఁ...ఆఁ... అదే! వాడి ఒళ్ళో... రామరామ! ఆ దృశ్యంకాస్తా దాని మొగుడికంటపడింది. మగా డయిన వాడు అలాంటివి సహిస్తాడా? అలాగే వాడూ సహించలేక జుట్టుపట్టుకుని తలగోడకేసి కొట్టాడు. దాంతో దానితల కాస్తా చిట్లి కుట్లుకూడా వడ్డాయి...." గొంతు తగ్గించి రహస్యంగా అంది కాంతమ్మ....

జయమ్మ ఆలోచనలో పడిపోయింది."కానీ నేను మరోలా విన్నానే" అంది మెల్లగా.

"ఏం విన్నావ్?"

"ఆ మీనాక్షి మొగుడు వెధవ తిరుగుళ్ళు తిరుగుతూ తాగొస్తూంటే, అదేవని మీనాక్షి అడిగిందనీ, అందుకు ఆగ్రహించి అతగాడు ఆమెని చావబాదాడనీ, అప్పుడు తలకి కుట్లు వడ్డాయనీ...."

"ఇంకెలా చెప్పుకుంటారు?, నా పెళ్ళాం వాళ్ళబావతో తిరుగుతోందని వాడు చెప్పుకుంటాడా, నేను నా బావ ఒళ్ళోపడుకుని ప్రేమ పాఠాలు చదువుకుంటుంటే, నా మొగుడు చూసి తన్నాడని అది చెప్పు కుంటుందా?"

"అంతేనంటావా?"

"కచ్చితంగా అంతే! ఇంక దానిగొడవెందుగ్గానీ అసలు విషయం చెప్పు" అంది కాంతమ్మ కుతూహలంగా.

"చెప్తాను చెప్తాను. ఇది ఆ మీనాక్షి, వాళ్ళ బావా ఆడిన సరసంలాంటిది కాదు. కనీ వినీ ఎరగని కథ" పూరించింది జయమ్మ ముసి ముసిగా నవ్వుతూ.

కాంతమ్మలోని కుతూహలం కొండలా పెరిగి పోయింది... "అబ్బ, అసలు విషయం తొందరగా చెప్పూ" అంది ఆలస్యం భరించలేనన్నట్టు.

"అయితే విను. పార్వతమ్మ లేదూ... అదేనమ్మా మన శివపార్వతమ్మ... ఆవిడగారు ఇటీవల ప్రణయం సాగిస్తోందట!" మెల్లగా అంది జయమ్మ.

అదిరిపడింది కాంతమ్మ

"ఛాఛ!... ఆవిడ ప్రణయం సాగించడమేవిఁటి నా బొంద! ఆవిడకి అరవై ఏళ్ళు దాటాయి" అంది అప్రయత్నంగా.

"అయితే ఏవిఁటి?" చిన్నగా నవ్వింది జయమ్మ.

"అదే.. అన్నీ వుడిగిపోయి"....

'హయ్యో.' ఇంకా నువ్వు దొడ్డిదారినే వున్నావొదినా! ఏళ్ళకి, దానికి సంబంధం లేదట! మొన్నే పుస్తకంలో చదివాను" "దానికి" అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ అంది జయమ్మ.

"అంటే.. అరవై.ఏళ్ళు దాటినా.."

"ఆహా! అరవై పైబడ్డా వాళ్ళకు కూడా కోరిక లుంటాయట?"

కాంతమ్మలో వుత్సాహం మరింత పెరిగిపోయింది.

"అలాగే.. చెప్పు! చెప్పు! ఇంతకీ పార్వతమ్మగారి కథానాయకుడెవరు!" అంది కాస్తముందుకు ఒంగి.

"అక్కడే వుంది తమాషా! ఆ కథానాయకుడెవరో కాదు. గోవర్ధనపురంలో శుక్రాచార్యులుగారే".

"శివ! శివ!" చెవులు మూసుకుంది కాంతమ్మ.

"శివ శివకాదు. కృష్ణ కృష్ణ అను! అతగాడు అమ్మాయిల విషయంలో శ్రీకృష్ణపరమాత్మేనట!" రహస్యం చెప్తున్నట్లు గొంతు తగ్గించి అంది జయమ్మ.

"ఏం పిదప కాలం వచ్చిందమ్మా! నిజంగా ఆ శుక్రాచార్యులుగారు ఎంత పెద్దమనిషిలా కనిపిస్తాడు" అదోలా నిట్టూరుస్తూ అంది కాంతమ్మ.

సరేలే! చూడ్డానికి అందరూ బానే వుంటారు. దగ్గరికెళ్తేనే గానీ అసలు రంగు బైట పడదు".

"వెరీగుడ్! మంచి సమయంలోనే వచ్చినట్టున్నాను" అంటూ వచ్చాడు కాంతమ్మ మేనల్లుడు చక్రవర్తి. అతన్ని చూడగానే కాంతమ్మ మొహం చాటంత యింది. అతన్ని ఆహ్వానించి కూర్చోబెట్టి-

"నువ్వెప్పుడొచ్చావ్‌రా! అంది

"ఈపూరు పొద్దున్నే వచ్చాను. ఇక్కడికిమాత్రం పార్వతమ్మగారికీ, శుక్రాచార్యులుగారికీ మధ్యనున్న ప్రణయసంబంధం గురించి మాట్లాడుతున్నారు చూడు అప్పుడే వచ్చాను. సరదాగా కాసేపు మీమాటలు వింటూ నిల్చున్నాను.. అదిసరే.. అక్కావాళ్ళూ కనిపించరేం?" చుట్టూకలయ చూస్తూ అన్నాడు చక్ర వర్తి. కాంతమ్మ మొహం మాడ్చుకుని చెప్పింది.

"జయమ్మగారూ! నాకో చిన్న సందేహం" అన్నాడు ఆమెకేసి చూస్తూ. చక్రవర్తికి ఆవిడేకాదు, ఆవూరి వాళ్ళు చాలామంది తెలుసు.

"ఏవిఁటయ్యా అది!" అనుమానంగా చూసింది జయమ్మ.

"పార్వతమ్మగారు అరవైఏళ్ళు దాటిన వృద్ధురాలు. ఇంక శుక్రాచార్యులు గారికి డెబ్బయ్యేళ్ళకి తక్కువ వుండవు..కదూ!"

"బావుంది.. వదిన అబద్ధం చెప్తుందేమిట్రా!" అంది కాంతయ్య, చక్రవర్తి జయమ్మని నిలదీస్తున్నా డనుకుని.

"అబ్బే! అబద్ధమని కాదు. వాళ్ళిద్దరి మధ్యనా అక్రమ సంబంధం వుందని ఈవిడికెలా తెలిసిందా అని" అన్నాడు చక్రవర్తి.

"ఓ అదా!... నాకే కాదు. చాలామందికి తెలిసింది" వుత్సాహంగా అంది జయమ్మ.

"అదే ఎలా అని! మీ కంటితో చూశారా!"

"ఛ ! ఛ అలాంటి పచ్చిపాపం నా కళ్ళతో నేను చూళ్ళేను నాయనా"

"మరెవరు చూశారు?" సూటిగా చూస్తూ అడిగాడు చక్రవర్తి.

"ఎవరు చూశారు అని నువ్వంత సూటిగా అడిగితే ఏం చెప్తాను.. రోజూ సాయంత్రం అయ్యేసరికల్లా ఆ శుక్రాచార్యులుగారు పార్వతమ్మగారింటికెళ్ళి గంటల తరబడి కూర్చుంటాడటయ్యా!"

"ఓ అదా!.. శుక్రాచార్యులుగారు వాళ్ళింటికి తరచూ వెళ్తాడు కాబట్టి వాళ్ళిద్దరికీ సంబంధం వుందని మీరు తేల్చేశారు. అయితే మీ ఇళ్ళకెవరూ రారా?"

"ఏవిట్రా చిన్నా పెద్దా లేకుండా ఆమాటలు" విసుక్కుంది కాంతమ్మ.

"సారీ! మిమ్మల్ని నొప్పించాలని కాదత్తయ్యా! కళ్ళతో చూడకపోయినా అసంభవాల్ని సంభవాలు చేసి కథలల్లి ఆనందిస్తారు. కానీ దానివల్ల ఎంత మంది ఎన్నిరకాలుగా 'బాధపడతారో తెలుసా?.. అసలు అలా కథలల్లి చెప్పుకుంటే మీకొరిగేదేమిటి? ఒక్కసారి ఆలోచించండి" బాధగా అన్నాడు చక్రవర్తి.

అతని మొహం చూశాక కాస్త ధైర్యం వచ్చింది ఆడవాళ్ళిద్దరికీ.

"అదికాదురా చక్రీ!... ఆపార్వతమ్మకి మొగుడు పోయాడా!.. అయినా బొట్టు అదీ తీసెయ్యకుండా టింగురంగా అని తిరుగుతుంది! ఇలా చేస్తే ఎవరు మాత్రం హర్షిస్తారు చెప్పు!" అంది కాంతమ్మ.

"అవునయ్యా: మొన్నామధ్య తల్లో పూలు కూడా పెట్టుకుంది." వుత్సాహంగా అంది జయమ్మ.

చక్రవర్తికి వాళ్ళిద్దరిమీదా అసహ్యం వేసింది. అయినా బైట పడకుండా,

"ఇదిగో అత్తయ్యా! ఒక్కటడుగుతాను చెప్పు! బొట్టు పూలు అన్నవి పెళ్ళితో వచ్చాయా మొగుడు పోతే తీసెయ్యడానికి! అయినా ఎవరి ఇష్టం వాళ్ళది! మధ్య మీకెందుకు" అన్నాడు కాస్త తీక్షణంగా.

జయమ్మ మొహం మాడిపోయింది.

"విన్నావా ఒదినా వీడిమాటలు! ఎంతైనా రచయిత కదా! ఆదర్శభావాల్లే. అయినా వురుము లేని పిడుగులా వచ్చిపడ్డావ్. ఏమిట్రా ఆఫీసువనా!" కాంతమ్మ మాట మార్చింది.

చక్రవర్తి ఇంక ఆ టాపిక్ వదిలెయ్యాలనుకుని - .. "మరేం లేదత్తయ్యా! ఈ వూళ్ళో ఓ రైటరుకి సన్మానం ఇవాళ.. అందుకే తప్పనిసరిగా రావల్సొచ్చింది". వాచ్ చూసుకుంటూ అన్నాడు.

రైటరనగానే వాళ్ళిద్దరికీ కుతూహలం పెరిగిపోయింది.

"రైటర్‌కి సన్మానమా? ఎవతా రైటరు?" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"మేనకగారని.."

"ఏవిటి. రచయిత్రి మేనకకి సన్మానమా?" ఆనందంగా అంది జయమ్మ.

"ఏవిటి మేనకగారు మీకు తెలుసా?" ఆశ్చర్యంగా చూశాడతను.

"ఆవిడ తెలియక పోవడమేమిటి! ఆవిడ జీవిత చరిత్ర కూడా మాకు తెలును" రవంత గర్వంగా అంది కాంతమ్మ.

"అవునయ్యా! ఆవిడ రాసిన నవలల్లో పదిహేను సినిమాలుగా వచ్చాయి. అయిదు కన్నడంలోకి అనువదించబడ్డాయి.. 'సరుకుతోట', 'స్మశాన వైరాగ్యం' నవలలతో ఆవిడకి ఎక్కువ పేరొచ్చింది.. ఇవి చాలా ఇంకా చెప్పనా!" ముసి ముసిగా నవ్వుతూ అంది జయమ్మ.

వాళ్ళ పరిజ్ఞానానికి విస్తుబోయాడతను. "ఇవన్నీ మీకెలా తెలును!" అన్నాడు విస్మయంగా.

"తెలుగులో మేం చదవని నవల లేదురా చక్రీ! అంతేకాదు ఆవిడ జీవితవిశేషాలు కూడా తెలును చెప్పనా?" అంది కాంతమ్మ.

"ఒద్దులే ఒదినా! మనం ఏంచెప్పినా కథలల్లుతాం, కాకరకాయ చేస్తాం అంటాడు. అయినా ఇతగాడికి తెలియకుండా వుంటాయా ఆ వివరాలన్నీ" అదోలా అంది జయమ్మ.

"నిజంగా నాకేం తెలియదావిడ గురించి. ఓ రచయిత్రి అని మాత్రమే తెలును. చెప్పండి. నాకూ తెలుసుకోవాలనుందావిడ గురించి" కుతూహలంగా అన్నాడు చక్రవర్తి.

ఆడవాళ్ళిద్దరికీ వుత్సాహం వచ్చేసింది. "అది.. అదే ఆమేనక ఎంత అసాధ్యురాలనుకున్నావ్! ప్రొడ్యూసర్ వసుమతిగారిని వల్లో వేసుకుని తన నవలలన్నీ సినిమాలుగా తీయించింది. లక్షలకి లక్షలు గుంజింది. అంతేనా పత్రికాఫీసులకెళ్ళి వయ్యారాలు ఒలకబోస్తూ తన రచనలు పత్రికల్లో వేయించుకుంటుందిట! ఏమాటకా మాటే చెప్పాలి. మనిషి మాత్రం చాలా అందంగా వుంటుందట! పచ్చని పసిమిరంగుతో.."

"అబ్బే పసిమి రంగు కాదొదినా! చామన చాయట! అయితే మాత్రమేం మంచి కళ గల మొహం" సరి చేసింది జయమ్మ

"మీ వూహాశక్తికి నా జోహార్లు" గభాల్న లేచి క్లాప్ చేస్తూ అన్నాడు చక్రవర్తి.

"ఏవిటయ్యా మేం అబద్ధం చెప్తున్నామంటావా?" కోపంగా అంది జయమ్మ.

"మేమిద్దరం ఇంత ఇదిగా చెప్తుంటే నీకు నమ్మకం కలగడం లేదన్నమాట?" కస్సుమంది కాంతమ్మ.

"నమ్మకం లేక కాదత్తయ్యా. ఆ మేనకగారు..."

"అమాయకురాలంటావ్! గడపదాటి బైటికెళ్ళని మహా ఇల్లాలంటావ్! అంతేనా?"

"ఆఁ. అనుకుంటూనే వున్నాను. అంతదూరం నించి ఆవిడగారి సన్మానంకోసం వచ్చాడంటే. ఇతగాడు ఆవిడగారి వల్లో".... జయమ్మ మాట పూర్తి కానేలేదు.

"స్టాప్" పెద్దగా అరిచాడు చక్రవర్తి.

బిగుసుకుపోయారు ఆడవాళ్ళిద్దరూ.

"మీ మీ భర్తలు కొంపలోంచి బైటికెందుకు పోయారో ఇప్పుడర్థం అయింది నాకు.. కానీ మీ పరిజ్ఞానం చివర్లో పల్టీలు కొట్టింది" అన్నాడతను కఠినంగా

"అంటే.. ఆవిడ..."

"ఆవిడ కాదు. ఆయన! మేనకగారు మీరనుకున్నట్టు స్త్రీ కాదు. అరవై అయిదేళ్ళ వృద్ధుడు. తనని గురించి ప్రచారం చేసుకోవడం ఇష్టం లేనివాడు కాబట్టి తన గురించిన నిజాలేం మీకు తెలియవు!. ఆయన రచనల్ని బట్టి మీరు చక్కని కథలల్లుకుని ఆనంద పడుతున్నారు. మీలాంటి వాళ్ళు వూరి కొక్కరుంటే చాలు! ఛ!" చక్రవర్తి కంఠంలో అంతులేని అసహ్యం చోటు చేసుకుంది.

కాంతమ్మ, జయమ్మల మొహాలు కాలిన పెంకుల్లా నల్లపడ్డాయి.

"నిజంగా మేనక మగాడా!" అన్నారు ఒకేసారి తడారిపోతున్న గొంతుకలతో.

"అవును. అది ఆయన పెన్‌నేమ్! కావాలంటే రండి పరిచయం చేస్తాను. వద్దు మీలాంటివారు నాక్కావల్సిన వాళ్ళంటే నాకు సిగ్గుచేటు.. వస్తా ఇంకా స్పేవుంటే నాభార్యని గురించి నాకూ ఓ కథల్లి చెప్పి నాకాపురం నట్టేట కలుపుతారు. ఇంతదూరం వచ్చాను కదా ఓసారి చూసిపోదామని వచ్చినందుకు చాలా విషయాలు తెలిశాయ్. వస్తా" అంటూ విసురుగా బైటికెళ్ళిపోయాడు చక్రవర్తి.

కత్తివేటుకి నెత్తురు బొట్టు లేనంతగా పాలిపోయాయి కాంతమ్మ జయమ్మల మొహాలు.

"వెరీగుడ్! మామయ్యా మీ వూహాసుందరి మేనక గురించి చెప్పాడు".. పదినిమిషాల తర్వాత కాలేజీ నించి వచ్చిన కాంతమ్మ మనవరాలు వ్యంగ్యంగా అన్నమాటలతో ఈ లోకంలోకొచ్చారు గాలికబుర్ల అమ్మలక్కలిద్దరూ. □



## మహిళాభ్యుదయ సంస్థ దశాబ్ది ఉత్సవాలు

"మనదేశంలో కుటుంబ వ్యవస్థ ఇన్నివందల సంవత్సరాలుగా సుస్థిరంగా, గౌరవప్రదంగా వున్నదంటే దానికి కారణం మన స్త్రీలే. అలాంటి స్త్రీలు నేడు స్త్రీ స్వేచ్ఛ పేరుతో పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా, ఆదర్శంగా అనుసరించాలనుకుంటున్నారు. కానీ దీనివలన దుష్ఫలితాలే గానీ సత్ఫలితాలు రావు. ఇప్పుడు పాశ్చాత్య దేశాలవారు మన కుటుంబ వ్యవస్థని, సంస్కృతిని ఎంతగానో ఇష్టపడుతూ వారుకూడా ఈ మార్గాన్నే అనుసరించాలనుకుంటున్నారు. ఎందుకంటే స్వేచ్ఛ పేరుతో ఇన్నాళ్ళుగా వారు అనుభవించిన జీవితంలో ఆప్యాయతలు, అనురాగాలు లోపించి, బంధాలు అనుబంధాలు లేకుండా జీవితాలు యాంత్రికంగా, పేలవంగా తయారయి తీరని అశాంతికి లోనవుతున్నారు. కాబట్టి మన స్త్రీలు పాశ్చాత్య సంస్కృతిని అనుసరించాలనుకోవడం దూరపుకొండలు నునుపు అని గ్రహించకపోవడమే. కారణం 'కల్చరల్ రివల్యూషన్' వచ్చిననాడు స్త్రీ పురుష సమానత్వం లభిస్తుంది. నేడు మనకు రావలసింది ఆ రకమైన రివల్యూషన్ మాత్రమే" అని గవర్నర్ శ్రీ కృష్ణకాంత్ 13వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో జరిగిన "మహిళాభ్యుదయ సంస్థ" దశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తూ సందేశమిచ్చారు.

సభకు అధ్యక్షత వహించిన శ్రీమతి ఎ.శ్యామలాదేవి సావనీరు ఆవిష్కరించి తమ సందేశాన్ని చదివి వినిపించారు.

ఈ సభలో 'వ్యక్తిగత సమస్యలు - సమాధానాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ హైద్రాబాద్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి "ఈ పుస్తకం చదివిన తర్వాత శ్రీమతి మల్లాది సుబ్బమ్మగారు కుటుంబ సలహా రంగంలోగల తమ విశేషానుభవంతో సమస్యలకు సమాధానాలిచ్చినట్లు స్పష్టంగా తెలుస్తున్నద"ని ప్రశంసించారు. మరో పుస్తకం "స్త్రీల లైంగికత! లైంగిక స్వేచ్ఛ" ఆం.ప్ర. సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ ఆర్.వి.ఆర్.చంద్రశేఖర్‌రావు ఆవిష్కరిస్తూ ఆ పుస్తక విశిష్టతను వివరించారు. స్వచ్ఛంద సంఘ సేవకురాలు శ్రీమతి ఆవుల జయప్రదాదేవి 'ఉమెన్స్ లిబరేషన్' అనే ఇంగ్లీషు పుస్తకాన్ని ఆవిష్కరించి అందులో వున్న కొన్ని ముఖ్య విషయాలను ఉదహరిస్తూ, అది తప్పకుండా అందరూ చదవవలసిన పుస్తకమని చెప్పారు. సభావేదిక నలంకరించిన పెద్దలందరూ స్త్రీ విముక్తికి శ్రీమతి మల్లాది సుబ్బమ్మగారు చేస్తున్న విశేష కృషిని కొనియాడారు.

సంస్థ డైరెక్టర్ శ్రీమతి మల్లాది సుబ్బమ్మ నివేదికను చదవగా, డా|| పుతలీబాయ్ కృష్ణమూర్తి వందన సమర్పణ చేశారు.

సభానంతరం 'మలక్‌పేట మహిళా సమాజం' వారు, 'శారదా మహిళా మండలి' వారు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.